# ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు

దేవదాసు చీకటి గదిలో ఒంటరిగా కూర్చుని కరువు దీరా ఏడుస్తున్నాడు. ఇరవై రెండు సంవత్సరాలుగా అవమానాలను, అసహ్యాలను, అనేకరకాల బాధలను భరించిన అతని రక్తం హీమోగ్లోబిన్ ఇగిరిపోయేంతగ సలసల మరిగి, పలచబడి చివరికి కన్నీటి రూపంలో అతని రెండుకళ్ళనుండి బయటకు రాసాగింది. ఆ కన్నీటి పొరలమాటున ఎన్నో బాధాకరమైన అనుభవాలు... ఎగసి పడుతున్న ఆ గుండెలో ఎన్నో జ్ఞాపకాల బరువు...

తరతరాలుగా బానిసత్వం, అంటరానితనం వంటి క్రూర సాంఘిక నియమాలకు బలియైన ఒక జాతిగాథకు ప్రత్యక్ష నిదర్శనం దేవదాసుకు.

"ఆ రోజే అతను ఒక ఉద్యోగానికి " ఇంటర్వ్యూ"కి

వెళ్ళాడు. ఆ ఇంటర్వ్యూని చేసిన పెద్దలు తన సబ్జక్టులకు, జనరల్ నాలెడ్జికి సంబంధించిన తికమక ప్రశ్నలను వెయ్యటమేగాక ఫిజిక్సు గ్రాడ్యుయేట్ అయిన తనని పట్టుకుని "నువ్వు రేడియోను ఎప్పుడైనా చూసేవా? దానిని ఎలా ఉపయోగించాలో నీకు తెలుసా?" అని అడిగేరు.

వాళ్లు అడిగిన ప్రశ్నలు తనని ఎంతగా నిరుత్తరుడిని చేసినవో, వాళ్ళు అడిగిన 'తీరు' తనని అంతకన్నా పదిరెట్లు గాయపరచింది.

నిజమే! తను రేడియోను దగ్గరగా ఎప్పుడూ చూడలేదు. దానిని ఎలా 'ఆన్' చెయ్యాలో తనకి తెలియదు. రేడియోనుగురించి తనకు తెలిసినది కేవలం పుస్తక పరిజ్ఞానమే! అందులోని భాగాలు అవి ఎలా పనిచేసేవి అంతా థియరీలో చదువుకున్నాడు. కాని మామూలుగా రేడియోని ఎన్నడూ తను చేత్తో ముట్టుకోనే లేదు. ఆ సంగతి తెలిసినట్లే వాళ్ళా ప్రశ్నను వేసి తనను 'ఫూల్'ని చెయ్యటం మరింత బాధాకరంగా ఉంది తనకు.

తనకు తెలియని విషయాన్ని తెలియదని చెప్పటమే తన తప్పయింది.

తనకు ఉద్యోగం దొరకదన్న సంగతి తేలిపోయింది. ఈ సంగతి ఏ ముఖం పెట్టుకుని యింట్లోవాళ్ళకు చెప్పటం? ఏభై మైళ్ళదూరానవున్న పల్లెటూరిలో గుడిసెలో దైన్యం ఉట్టిపడే రూపాలతో ఉండే వృద్ధులైన తల్లిదండ్రులు, నలు

గురు చెల్లెళ్లు గుర్తుకు వచ్చేసరికి దేవదాసుకు గుండె తరుక్కు-పోయింది. లేక లేక పుట్టిన కొడుకు తను. తనకన్న ముందు పుట్టిన నలుగురుపిల్లలు పురిటిలోనే పోగా ఐదవ సంతానమయిన తనని అల్లారుముద్దుగా పెంచి చదువు చెప్పించేరు తల్లిదండ్రులు తన తరువాత వాళ్ళంతా ఆడపిల్లలే అవటంతో తనమీద తల్లిదండ్రులకు గల ప్రేమ మరింత యినుమడించింది. ఉన్న ఒక్క-కొడుకూ చదువుకొని ప్రయోజకుడై తమని ఉద్ధరిస్తాడని ఆ ముసలివాళ్ళ ఆశ!

ఐనా తప్పు తనదేనేమో! రేడియో పెట్టటం వచ్చునని అబద్ధమాడితే బాగుండేదేమో! వాళ్ళేం రేడియో తెప్పించి పెట్టి తనని ఉపయోగించమని అడగరుకదా! కాని ఎందుకో అబద్ధమాడటానికి తన మనసంగీకరించలేదు. ఐనా తను కులంరీత్యా తండ్రియొక్క- ఆర్థికస్థితిదృష్ట్యా అట్టడుగు జాతిమనిషి నని తెలిసికూడా వాళ్ళు బుద్ధిపూర్వకంగా అలాటి ప్రశ్న వేయడంలో వాళ్ళ ఆంతర్యమేమిటి? కావాలని తనని తేలికపరచి తన అజ్ఞానాన్ని, వెనుకబడినతనాన్ని వేలెత్తి చూపించి తనని హింసించటానికా?

ఇలా అబద్ధం ఆడటం చేతకాక నిజం చెప్పి నలుగురి దృష్టిలోనూ నవ్వులపాలవటం తనకి కొత్తేం కాదు.

ఒకసారి తను బియస్సీ చదువుతున్న రోజుల్లో తనని చూట్టానికి తండ్రి ఊరునుండివచ్చేడు. తన రూము ఎక్కడో తెలియనందున కాలేజీకి వచ్చేడు తండ్రి ఆకారం, దుస్తులు

అవీ చూసి యీ "శాస్త్రీ ఎక్కడిదిరోయ్!" అని పిల్లలం దరూ ఒకటే అరవటం, నవ్వటం, తనప్పుడు క్లాసులో ఉన్నాడు? తండ్రి బిక్కమొహం వేసుకుని ఒకొక్కరూమే వెతుక్కుంటూ వస్తున్నాడు. వెనక అరుస్తున్న పిల్లలబారి నుండి తప్పించుకుని, తన రూముదగ్గరకు వచ్చేక కూడా తనని అంత మందిలో గుర్తుపట్టలేక వెళ్ళిపోతుంటే తనే లెక్చరర్ పర్మిషన్ తీసుకుని బయటకు వెళ్ళి తండ్రిని కలుసుకున్నాడు. తామిద్దరూ కలసి నడుస్తుంటే అటుగా... వెళ్తున్న యిద్దరు సిద్యార్థులు "ఏ డెవడోయ్? మీ సర్వెంటా?" అన్నారు.

"కాను, మా ఫాదర్" అని సమాధానమిచ్చేడు తను, ఆ సమాధానం విన్న వాళ్ళ కళ్ళలోని భావాన్ని యీనాటికి మర్చిపోలేదు తను పేదవాడు, చదువురానివాడు అయిన ఒక పల్లెటూరి మనిషికి పుట్టటం అంత హేయమైన విషయమా? అని ఇప్పటికీ తను అనుకుంటాడు, ఒక సెళ పుట్టినా అలాటి వాళ్ళ కొడుకులు తెల్ల బట్టలు వేసుకొని తనులా కాలేజీ చదువులు చదవకూడదని కాబోలు వారి అభిప్రాయం అనుకున్నాడు.

తండ్రికి "సర్వెంటు" అన్న పదానికి అర్థం తెలియదు. కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎంత బాధపడేవాడు! తనతో పాటు తండ్రి, తల్లి, చెల్లెళ్ళు అంతా బాధపడేవాళ్ళు ఆ సంఘటనను తలుచుకుని, ఏమైనా ఆ రోజు అనుభవం తండ్రికి ఘాటయిన పాఠాన్నే నేర్పినట్లుంది. విద్యా

స్థల తీరు. వాళ్ళ ముఖ కవళికలు అన్నీ ఏ భాషా అందించలేని భావాలను తెలియబరచినయ్ కాబోలు. మళ్ళీ తాను ఆ కాలేజీలో చదువుకున్నంత కాలంలో ఒక్కసారైనా ఆ కాలేజీఆవరణలో అడుగుపెట్టలేదు. మనుష్యులను చూసి బెదిరిపోయే వన్యమృగంలా ఆ ఛాయలకు రావటానికే భయపడ్డాడు.

ఔను. తన కులం ఎంత హీనమైందో, సంఘంలో తనకీ, తన పిల్లలకీ ఎలాటి స్థానం ఉందో తనతండ్రికి బాగానే తెలుసు. అందుకే ఊళ్ళోని పెద్దమనిషి రామయ్యచౌదరి తన పెద్దకూతురిని పొలంలోబలాత్కరిస్తేఏమీ చెయ్యలేకపోయేడు. తన తమ్ముడు కొడుకు పుల్లయ్య సోలెడు వేరుశనగకాయలను చేలోనుండి దొంగతనంగా కోసుకుని తిన్నాడన్న నెపంతో వాడి జుట్టు గొరిగించి, సున్నపుబొట్లు పెట్టి గాడిదమీద ఊరేగించి అవమానపరిస్తే ఏమీ చెయ్యలేక ఊరుకున్నాడు.

తనకొడుకు తనలాగా పల్లెటూరిలో పాలేరుతనం చేస్తూ, అందరి పాదాలక్రింద నలుగుతూ బ్రతకటం యిష్టం లేకనే నానా అవస్థలూ పడి, కొడుకుని పట్నం పంపి చదువు చెప్పిస్తున్నాడు. కాని యీ పట్నంలో ఉండి కాలేజీ చదువులు చదువుకునికూడా తన తండ్రికంటె ఏ రకంగానూ గౌరవాన్ని సంపాదించలేకపోయేడు. తనకులాన్ని, పేదరికాన్ని, తన అమాయకత్వాన్ని, నిష్కపట ప్రవర్తనను ఆధారంగా తీసుకునియిక్కడ అందరూ తనని గేలిచెయ్యటానికి, అవమాన

పరచటానికి చూస్తుంటారు ఇంక తండ్రి విషయమే కాస్త మెరుగు పుట్టి పెరిగిన వాతావరణం బానిసత్వాన్ని సహనాన్ని అతనికి నూరిపొయ్యటంవలన అవమానాలను, బాధలను సహజంగా తీసుకునే మనస్తత్వం ఏర్పడింది ఆయనకి. కాని తను మెసలే యీ వాతావరణం తనని బానిసగా బ్రతకనీయదు. సమానత్వం నినాదాల చాటున ఎన్ని ఎత్తుపల్లాలు ఉన్నవో, నాగరికత మాటున ఎంతటి ఆటవిక మనస్తత్వం ఉండగలదో తన చుట్టూ వున్న మనుష్యులు రోజుకొక్కసారైనా తనకి గుర్తుచేస్తూంటారు.

తను ఎంతగా వాళ్ళపక్కన కూర్చుని భోజనంచేస్తూ వాళ్ళతోపాటు చదువుకుంటున్నా తన కులాన్ని వాళ్ళు మర్చిపోలేదు. ఆ కులం ఎంత హీనమైందో తనకి గుర్తు చెయ్యటంకూడా మానదు.

సుమిత్రకూడా తనకి దూరమయింది తన కులంవల్లనే కదా. కాలేజీలో రెండుసంవత్సరాలుగా బిడియంగా ఉండేవాడు తను. మూడవసంవత్సరంలో సుమిత్రే తనని కవ్వించి, తన మాటలతో చేష్టలతో తన మనసును గిలిగింతలు పెట్టి తనలోని పురుషుడిని మేల్కొలిపింది. ఆమెతో స్నేహం చేసిన ఆరునెలలూ ఎంతో తియ్యగా గడచిపోయినయ్ తనేమిటో తనకి తెలిసింది. ఆమెను ప్రేమించటం మొదలెట్టిన తరువాతనే ప్రేమించే ప్రతివ్యక్తిలాగానే ఆ ప్రేమను శాశ్వతం చేసుకోవడానికి ఆమెను పెళ్ళిచేసుకోదలచుకున్నాడు.

ఆమాట ఆమెతో చెప్పినప్పుడు ఆమె తను ఆశించినట్లు ఆనందపడలేదు. ఆలోచనలో పడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అనడిగేడు తను.

"అన్నట్టు మీ కులమేమిటన్నావ్?" అనడిగింది సుమిత్ర. చెప్పేడు తను.

తన కులంపేరు వింటూనే పామును చూచినట్లు తనకి దూరంగా ఆగింది సుమిత్ర.

"ఏమిటి? నువ్వు... నువ్వు... 'ఆ'కులం వాడివా" అంది పాలిపోయిన ముఖంతో తన మనసు కుంచించుకు పోయింది. "నీకు మా కులం తెలుసనుకున్నాను. తెలిసే నాతో స్నేహం చేస్తున్నా వనుకున్నాను" అన్నాడు.

"మీది ఏదో వెనుకబడిన కులం అయి ఉంటుందని ఊహించుకున్నాను కాని మరీ యింత...దారుణం ఊహించ లేక పోయేను. క్షమించు ఇలాంటి కులమంటే మా తలిదండ్రుల దాకా ఎందుకు? నాకే చచ్చభయం. మన పెళ్ళి అసంభవం" అని చెప్పింది, మరో సంవత్సరంలో గ్రాడ్యుయేట్ కాబో తున్న భారత స్త్రీ సుమిత్ర.

వెనకబడిన జాతులలోకూడా ఇంకా తరగతులు ఉం టాయి కాబోలు అనుకున్నాడు తాను. ఆ మాటకి వస్తే సుమిత్ర కూడా మరీ అగ్రజాతి స్త్రీ కాదే! ఆమె కులంకన్న రెండు మూడు మెట్లు ఎగువనున్న కులాలు ఉన్నయ్.

ఐనా ఆమె నని ఏం లాభం? తరతరాలుగా వేళ్ళు పాతుకుపోయిన ఒక వ్యవస్థని కాదనగలశక్తి ఒక్క అబల కుంటుందను కోవటం తనదే పొరపాటు.

ఆరోజే తను దృఢంగా నిశ్చయించుకున్నాడు తను తన కులం అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలని— తన భార్య ఎట్టి పరిస్థితులలోనూ లోకవిరుద్ధంగా ప్రవర్తించి పశ్చాత్తాప పడవలసిన స్థితి సంభవించ కూడదనీను.

ఎవరో టకటకమంటూ గొళ్ళెం చప్పుడు చేస్తున్నారు.

దేవదాసు ఆలోచనలనుండి తేరుకుని కళ్ళు తుడుచు కుని లైటు వేసేడు

చీకటికి అలవాటుపడ్డ అతని కళ్ళు ఒక్కసారిగా వెలుగును చూడలేక నొప్పిపుట్టినయ్. మరోసారి గట్టిగా కళ్ళు మూసుకుని తెరచి తలుపు తీసేడు.

ఎదురుగా శాస్త్రి.

"ఏమిటి? ఏం చేస్తున్నావ్? లోపల లైటుకూడా వేసు కోకుండా ఏమిటి నువ్వుచేస్తున్నది? ఇప్పుడా లైటు వెయ్యటం? పొదుపు ఉద్యమం ప్రారంభించేవా? లేక మనసులో ప్రేమగీతాలు పాడుకుంటూ పడుకున్నావా?" అంటూ ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరిచేస్తూ సుడిగాలిలా గదిలోకి ప్రవేశించి మంచంమీద కూలబడ్డాడు శాస్త్రి.

దేవదాసు శాస్త్రి ప్రశ్నల కేమీ సమాధానం చెప్ప కుండా అతని వంకనే రెప్పవాల్చకుండా చూస్తూ నిల్చు

న్నాడు. శాస్త్రి బొద్దుగా, పచ్చగా, కలకల లాడే ముఖంతో ఖరీదైన బట్టలతో కనపడతాడు. అంటే — అన్ని విధాలా తనకి పూర్తి వ్యతిరేకం.

అందుకే కాబోలు తామిద్దరికీ ఒకరంటే ఒకరికి వల్లమాలిన అభిమానం.

"ఏమిటీ? ఇంటర్వ్యూ బాగా జరిగిందా?" అనడిగేడు. జరిగినదంతా దాచకుండా చెప్పేడు దేవదాసు. ఆఖరికి కన్నీటినికూడా అతనిముందు దాచలేకపోయేడు.

శాస్త్రి ముఖం చిన్నబోయింది. నవ్వుతూన్న అతని ముఖం ఒక్కసారిగా వాడిపోయింది.

"ఇంత అవమానం జరిగింది చాలక యింకో విచిత్రమేమిటో తెలుసా? ఇంటర్వ్యూకి అయిన నేను బయటకు వచ్చేసరికి నాతోపాటు ఇంటర్వ్యూకి వచ్చిన మిగతా అభ్యర్థులు నన్నుచూసి చెవులు కొరుక్కుంటున్నారు. బయటకు వస్తుంటే "ఈ షెడ్యూల్డు కాస్టువాళ్ళకు రిజర్వేషనుంది కాబోలు ఖర్మ! పేరుకు వెనకబడిన కులంకాని, అసలు వెనకపడ్డ వాళ్ళం ప్రస్తుతం మనమేనండీ! వాళ్ళకోసం పాఠశాలల్లో, ఆఖరికి ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ ఉంటుంది. మన కోసం "రిజర్వు" చేసే నాథుడు ఎవడూ లేడు" అన్న మాటలు వినపడినయ్. "నాకా మాటలు మొదట కష్టాన్ని కలిగించినా అందులోనూ కొంత నిజం లేకపోలేదనిపిస్తోంది శాస్త్రీ! అసలే అన్ని వర్గాలవాళ్లూ నిరుద్యోగ సమస్యతో

అల్లాడిపోతున్న రోజుల్లో యీ రిజర్వేషన్ వల్ల కొందరి అవకాశాలు పాడై పోతున్నాయేమో అనిపిస్తుంది" అన్నాడు దేవదాసు.

శాస్త్రి ముఖం కోపంతో జేవురించింది. "ఇంక చాలించు నీ ఉదారభావాలు, పెద్ద విశాల హృదయుడివి బయల్దేరావులే, నువ్వు కాబట్టి ఆ మాటలు విని తలవంచుకుని వచ్చేవు కాని నేనే ఆ స్థానంలో ఉన్నట్లయితే "చూడవయ్యా పెద్దమనిషీ! కొన్ని తరాలు మీ తాత ముత్తాతలు, మా తాత ముత్తాతలకు చేసిన అన్యాయాలకు, అక్రమాలకు ప్రతిఫలంగా మా కొరకు కాస్తంత 'రిజర్వేషన్' యిచ్చినంత మాత్రాన చాలదు. మీరు వంద తరాలవరకు మీ చర్మంతో చెప్పులు కుట్టించి యిచ్చిన మా జాతికి ఒకప్పుడు జరిగిన అన్యాయం తీరదు" అనేవాడిని" అన్నాడు.

దేవదాసు ఆనందంగా, గౌరవపూర్వకంగా చూసేడు శాస్త్రి వంక "శాస్త్రి! నువ్వెంత మంచివాడివి!" అన్నాడు. ఇంకా ఏమనాలో తోచలేదు అతనికి.

"నా మంచితనం కాదు అది నీలోని యిన్ఫీరియారిటీ కాంప్లెక్సు' నీచేత అలా అనిపిస్తోంది" అన్నాడు శాస్త్రి.

దేవదాసు పొడిగా నవ్వేడు. "ఔను. నాలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఉన్నమాట నిజమే! కాని యీ

కాంప్లెక్సు నా ఒక్కడిదీ గాదు. మనజాతికి, ఒకదేశానికి సంబంధించినది" అన్నాడు విరక్తిగా.

"ముందుగా కాంప్లెక్సును ఫోర్గెట్టుకో. తప్పక వృద్ధి లోకి వస్తావు. అన్నట్లు మా ఫాదర్ నిన్ను రేపువచ్చి తనని కలవమన్నాడు. ఆయన వ్యాపార వ్యవహారాలు చూట్టానికి ఒక సెక్రటరీ కావాలట. నీ పేరు సజెస్ట్ చేసేను నేను" అన్నాడు శాస్త్రి.